సాక్షి
అనంతపురం
సోమవారం । 14 । జూలై । 2025



మోసాలను తిప్పికొడదాం

చంద్రబాబు ప్రభుత్వ మోసాలను తిప్పికొడదామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు 'అనంత' పిలుపునిచ్చారు. 8లో

క్రిప్టో మాటున లూటీ

వెలుగులోకి మరో మోసం

- రూ.లక్ష కడితే రోజూ 20 యూఎస్ డాలర్లు అంటూ ఎర
- కోట్లాది రూపాయలు అప్పులు తెచ్చి మరీ కట్టిన అమాయకులు
- తాజాగా జెండా ఎత్తేయడంతో లబోదిబోమంటున్న వైనం



అనంతపురం: మరో ఆన్‌లైన్ మోసం వెలుగులోకి వచ్చింది. 'లుక్' యాప్ తరహాలోనే మాయగాళ్లు బురిడీ కొట్టించారు. క్రిప్టో మాటున రూ. కోట్లు లూటీ చేసినట్లు తెలిసింది. క్రిప్టో కరెన్సీ అనేది ఒక డిజిటల్ కరెన్సీ. ఇది ఏ దేశానికీ చెందింది కాదు. ఏ నియంత్రణ సంస్థ పరిధిలోకి రాదు. ప్రభుత్వ నియంత్రణ కానీ, స్వతంత్ర సంస్థ అదుపులో కానీ ఉండదు. ఇద్దరు వ్యక్తులు లేదా సంస్థల మధ్య నేరుగా బదిలీ చేసుకోగల డిజిటల్ కరెన్సీ మాత్రమే. ఈ కరెన్సీకి ఎలాంటి చట్టబద్ధత ఉండదు. కానీ కొన్ని రోజుల క్రితం విశాఖపట్నంకు చెందిన కొందరు వ్యక్తులు అనంతపురం నగరంలో పాగా వేసి వందలాది మందిని క్రిప్టో ముగ్గులోకి లాగారు. లక్ష నుంచి కోటి రూపాయల వరకు ఒక్కొక్కరి దగ్గర డిపాజిట్ చేయించుకున్నారు. రూ. లక్ష కడితే రోజూ 15 నుంచి 20 అమెరికన్ డాలర్లు ఇస్తామని నమ్మబలికారు. మాయగాళ్ల ఉచ్చులో పడిన పలువురు వారు చెప్పినట్లుగానే డిపాజిట్లు చేశారు. మొదట్లో లాభాలు బాగానే రావడంతో తెలిసిన వారు, బంధువుల నుంచి కూడా డబ్బులు డిపాజిట్ చేయించారు. నిర్వాహకులు కేవలం వెబ్‌సైట్‌లోనే లావాదేవీలు నిర్వహించారు. ఓ 'ఫండ్' పేరుతో మొదలైన దందా.. రెండు నెలలకే పేరు మార్చుకుంది. అదేంటంటే సాంకేతిక మార్పులు అని సర్దిచెప్పారు. ఈ క్రమంలో డబ్బు డిపాజిట్ చేస్తే రెట్టింపు అవుతాయని ఆశ చూపించి.. వారి నుంచి రూ.కోట్లు వసూలు చేశారు. తర్వాత ఒక్కసారిగా దుకాణం ఎత్తేశారు. ఉమ్మడి జిల్లాలో వందల మంది అమాయకులు మోసపోయినట్లు తెలిసింది. బాధితుల్లో అధికంగా చిరు వ్యాపారులు ఉన్నట్లు సమాచారం.

రిటైర్డ్ ఉద్యోగికి భారీ బురిడీ..

అనంతపురంలో ఆర్టీసీలో పదవీ విరమణ చేసిన ఓ ఉద్యోగి క్రిప్టో కరెన్సీ మోజులో పడ్డారు. తొలుత భారీ ఆదాయం రావడంతో మరికొంత మందితో సభ్యత్వం కట్టిస్తే మరింత లాభం వస్తుందని ఆశ పడ్డాడు. బంధువులు, స్నేహితులు అందరికీ క్రిప్టో కరెన్సీ గురించి చెప్పాడు. 'నేను కోటి రూపాయల వరకు చెల్లించా. మీరు కూడా పెట్టండి.. మంచి లాభాలు వస్తాయి. ఏడాదికే డబుల్ ఆదాయం సొంతమవుతుంది' అని వివరించాడు. తనకు లాభాలు వచ్చాయని ఆధారాలు సైతం చూపించాడు. దీంతో స్నేహితులంతా కలిసి రూ.5 కోట్లు పోగేశారు. విశాఖపట్నంకు వెళ్లి మరీ ఓ వ్యక్తికి నగదు ముట్టజెప్పారు. తాజాగా మొదటికే మోసం రావడంతో లబోదిబోమంటున్నట్లు తెలిసింది. విశాఖపట్నం ఏజెంట్ ఫోన్ నంబరు పనిచేయకపోవడంతో లోలోపలే కుమిలిపోతున్నట్లు సమాచారం.

క్రిప్టోలో చాలామంది పెట్టుబడులు..

క్రిప్టో కరెన్సీలో పెట్టుబడి పెడితే.. డాలర్లలో సంపాదన ఉంటుందన్న ఆశ మధ్య తరగతి ప్రజలను ఆకర్షిస్తోంది. క్రిప్టో పేరుతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో కొనసాగుతున్న వ్యాపారంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతున్నారు. తమ వద్ద ఉన్న డబ్బుతో పాటు అప్పులు తెచ్చి మరీ ఇందులో పెట్టుబడులు పెట్టడంతో మొదటికే మోసం వస్తోంది. మొత్తం డబ్బు పోవడంతో అప్పులు తీర్చే మార్గం లేక నరకయాతన అనుభవిస్తున్నారు. మోసపోయామని చెబితే బంధువులు, సమాజంలో మర్యాద పోతుందని మిన్నకుండిపోతున్నారు.

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో 'పరిష్కార వేదిక'



అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ (ఫైల్)

అనంతపురం అర్బన్: 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. రెవెన్యూభవన్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని, ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో సమర్పించాల్సి ఉంటుందన్నారు. గతంలో అర్జీ ఇచ్చి ఉంటే దానికి సంబంధించి రసీదు తీసుకురావాలన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమర్పించిన అర్జీల స్థితిని 1100 కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. అర్జీలను meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఆన్‌లైన్‌లోనూ సమర్పించవచ్చని తెలిపారు.

నేడు యల్లనూరులో 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో'



మాజీ మంత్రి సాకే శైలజానాథ్

యల్లనూరు: శింగనమల నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల్లో సోమ, మంగళవారాల్లో 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి సాకే శైలజానాథ్ తెలిపారు. పార్టీ నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. సోమవారం ఉదయం 10 గంటలకు యల్లనూరులో కార్యక్రమం ప్రారంభిస్తామన్నారు. ఏడాది సీఎం చంద్రబాబు పాలనలో ఎన్ని హామీలు అమలయ్యాయి.. ఇంకా ఎన్ని పెండింగ్ ఉన్నాయి అనే వివరాలను ప్రజలకు క్షుణ్ణంగా వివరిస్తామన్నారు. చంద్రబాబు పాలనలో జరుగుతున్న అరాచకాలను కూడా ప్రజల దృష్టికి తీసుకెళ్తామన్నారు. మొదటి రోజు కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

రేపు తాడిపత్రిలో..



మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రిటౌన్: పట్టణంలోని పాత వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' సమావేశం నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. సమావేశానికి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడు నరేష్‌రెడ్డితోపాటు జిల్లాలోని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తలు, జిల్లా స్థాయి నాయకులు హాజరవుతారన్నారు. తాడిపత్రి నియోజకవర్గానికి చెందిన పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, అనుబంధ సంఘాల నాయకులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు హాజరై జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

అన్నదాత దుఃఖీభవ

- అదిగో ఇదిగో అంటూ కాలం వెళ్లదీస్తున్న కూటమి సర్కారు
- రైతు సంక్షేమాన్ని పూర్తిగా గాలికొదిలేసిన చంద్రబాబు
- బీమా పరిహారమూ, ఆత్మహత్య బాధిత రైతు కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా నిల్
- వర్షాలు లేక, 'గిట్టుబాటు' దక్కక అల్లాడిపోతున్నా పట్టని వైనం



అనంతపురం అగ్రికల్చర్: అన్నదాత సుఖీభవ 'దుఃఖీభవ'గా మారింది. అధికారంలోకి వచ్చి ఏడాది దాటిపోయినా రైతులకు ఎలాంటి సాయం చేయకుండా అరచేతిలో వైకుంఠం చూపిస్తూ సీఎం చంద్రబాబు కాలం వెళ్లదీస్తున్నారు. గత ఎన్నికల్లో రైతుల ఓట్లు కొల్లగొట్టి అధికారం చేపట్టిన వాస్తవాన్ని కూటమి నాయకులు విస్మరించారు. వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టేస్తున్నారు. ఏడాది కాలంగా సరైన వర్షాలు లేవు, పంటలు పండలేదు, అరకొరగా వచ్చిన పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధరా దక్కడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో రైతుల బాగోగులు పట్టించుకోవాల్సిన చంద్రబాబు సర్కారు ఏ మాత్రం చిత్తశుద్ధి లేకుండా వ్యవహరిస్తుండడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్వయానా ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ప్రకటనలకే దిక్కులేకుండా పోయింది.

మొదటి ఏడాది ఎగ్గొట్టి..

'సుఖీభవ' ఇదిగో అదిగో అంటూ అన్నదాతలను ఏడాది కాలంగా ఊరిస్తూ వస్తున్నా ఇప్పటికీ అతీగతి లేదు. ఏటా రూ.20 వేలు ఇస్తామంటూ ప్రకటించినా.. జిల్లా రైతులకు మొదటి ఏడాది ఇవ్వాల్సిన మొత్తం రూ.580 కోట్ల పెట్టుబడి సాయం ఎగ్గొట్టేశారు. రెండో ఏడాదైనా ఇస్తారని ఆశలు పెట్టుకున్నా ఇవ్వడం లేదు. మే అన్నారు.. తర్వాత జూన్ 12.. 20 అన్నారు. ఆ తర్వాత జూన్ ఆఖరులోపు ఇస్తామన్నారు.. మళ్లీ జూలై మొదటి వారమని ఉసూరు మనిపించారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ప్రకటనలకూ దిక్కులేకుండా పోయింది. 'పీఎం కిసాన్' కింద ఇచ్చే రూ.6 వేలతో కలిపి రాష్ట్ర ప్రభుత్వం వాటా కింద రూ.14 వేలు ఇస్తామని ప్రకటించినా ఆచరణలోకి రాలేదు. కనీసం రూ.14 వేలు ఇచ్చినా గతేడాది జిల్లాలో ఉన్న 2.90 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి రూ.406 కోట్లు మేర జమ అయ్యేవి. ఈ సారి 'పీఎం కిసాన్' కింద మొదటి విడత ఇవ్వాల్సిన సొమ్ము కూడా జాప్యం చేస్తుండటంతో రైతులు కష్టాల్లో కూరుకుపోతున్న పరిస్థితి నెలకొంది.

కరుణ ఏదీ..?

అన్నదాత సుఖీభవతో పాటు పంటల బీమా పథకం కింద ఇప్పటికీ పరిహారం ఇవ్వలేదు. మరోవైపు.. పంటలు పండక అప్పుల పాలై పిల్లల చదువులు, పెళ్లిళ్లు భారమై ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు కూడా ఎక్స్‌గ్రేషియా చెల్లించలేదు. గత జూన్ నుంచి ఈ ఏడాది జూన్ వరకు 47 మంది వరకు రైతులు వివిధ రూపాల్లో బలవన్మరణం పొందినట్లు వ్యవసాయశాఖ వర్గాలు చెబుతున్నాయి. ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లినా స్పందించకపోవడంతో బాధితుల పరిస్థితి దారుణంగా తయారైంది. ఇక.. గత ఖరీఫ్, రబీలో పంటలు దారుణంగా దెబ్బతినడంతో కంటి తుడుపు చర్యగా కరువు మండలాలను ప్రకటించేసి ఇన్‌పుట్ సబ్సిడీ రూపంలో పైసా ఇవ్వకుండా చంద్రబాబు రిక్తహస్తం చూపారు. అకాల వర్షాలు, ఈదురుగాలులకు దెబ్బతిన్న పంటలకు కూడా 'ఇన్‌పుట్' ఇవ్వకుండా దాటవేశారు. పంట రుణాలు చెల్లించిన రైతులకు పావలావడ్డీ లేదు.. వడ్డీ రాయితీ కూడా ప్రకటించలేదు. ప్రభుత్వ సాయం కరువై అన్నదాత దిక్కులు చూస్తున్నా చంద్రబాబు కరుణించే పరిస్థితి కనిపించడం లేదు.

'ఆశల్ని' ఆపేశారు!

- అధికారుల అలసత్వం.. రైతులకు అశనిపాతం
- హెచ్చెల్సీలో పూర్తి కాని మరమ్మతు పనులు
- సరిహద్దులో ఆగిన తుంగభద్ర జలాలు



రెగ్యులేటర్ గేట్లను కిందకు దింపడంతో ఆంధ్రా సరిహద్దులో నిలిచిన తుంగభద్ర జలాలు

బొమ్మనహాళ్: రైతుల ఆశలపై అధికారులు నీళ్లు చల్లారు. ముందస్తుగా నీరొచ్చాయని పడిన సంతోషాన్ని ఆదిలోనే దూరం చేశారు. గంగపూజ నిర్వహించి స్వాగతించాల్సిన సమయంలో ఇలా జరగడం దురదృష్టకరమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుంగభద్ర జలాశయం నుంచి ఈనెల 10న హెచ్చెల్సీకి నీటిని విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో శనివారం రాత్రికి బొమ్మనహాళ్ సరిహద్దులోని 105–272 కిలోమీటర్ వద్దకు నీళ్లు చేరుకున్నాయి. అయితే, హెచ్చెల్సీలో మరమ్మతు పనులు ఇంకా కొనసాగుతుండడంతో వాటికి ఇబ్బంది లేకుండా 105వ కిలోమీటర్ వద్ద రెగ్యులేటర్ గేట్లు కిందికి దించి నీరు ఆంధ్రాలోకి ప్రవేశించకుండా ఆపేశారు.

పర్యవేక్షణ కరువై ఇష్టారాజ్యం..

కాంట్రాక్టర్ల అలసత్వం.. పర్యవేక్షణ ఇంజినీర్ల నిర్లక్ష్యం కారణంగా హెచ్చెల్సీలో మరమ్మతు పనులు అనుకున్నట్లుగా సాగడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 115 నుంచి 138 కిలోమీటర్ వరకు లైనింగ్ పనులు, నాగలాపురం వద్ద, ఉద్దేహాళ్–మల్లికేతి మార్గంలో బ్రిడ్జి పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో పనుల పూర్తికి మరింత సమయం పట్టే అవకాశం ఉంది. అప్పటివరకూ నీటిని ఆంధ్రా సరిహద్దులోనే ఆపేయాల్సి ఉంటుంది. మరోవైపు రైతులు బోర్ల కింద వరి, మిరప నార్లు పోసుకున్నారు. తుంగభద్ర నీరు వచ్చి ఉంటే నారుకు బాగుండేదని, బోరు నీటికి నారు ఎర్రగా మారుతోందని రైతులు వాపోతున్నారు. ఈ క్రమంలో మరమ్మతు పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయించి తమకు సాంత్వన చేకూర్చాలని కోరుతున్నారు.

కౌన్సెలింగ్‌లో పారదర్శకత ఏదీ..?



రీ కౌన్సెలింగ్ తీరుపై నిరసన వ్యక్తం చేస్తున్న ఏఎన్ఎంలు

అనంతపురం మెడికల్: సచివాలయ ఏఎన్ఎంల రీ కౌన్సెలింగ్‌లో పారదర్శకత లోపించిందని, నగరపాలక సంస్థ పరిధిలోని 74 సచివాలయాలతో పాటు వివిధ ప్రాంతాల్లో సీనియారిటీ జాబితాను చూపించలేదంటూ సచివాలయ ఏఎన్ఎంలు మండిపడ్డారు. ఆదివారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో చేపట్టిన ఏఎన్ఎంల రీ కౌన్సెలింగ్‌ను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. అప్పటికే డీఎంహెచ్ఓ కార్యాలయానికి లోపలి నుంచి తాళం వేయడంతో ఏఎన్ఎంలు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఏఎన్ఎంల రీ కౌన్సెలింగ్ జరపరాదంటూ నినాదాలు చేశారు. అధికారుల నుంచి సమాధానం రాకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు.

కలెక్టర్ పరిశీలన..

సచివాలయ ఏఎన్ఎంల రీ కౌన్సెలింగ్ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి, ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జునరెడ్డిని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. సీనియారిటీ ప్రాతిపదికన రీ కౌన్సెలింగ్ చేపట్టాలని, ఏమైనా తేడాలొస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఆదివారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో రీ కౌన్సెలింగ్ ప్రక్రియను ఆయన కాసేపు పరిశీలించారు.

ఎస్కేయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో కొత్త ప్రోగ్రామ్‌లు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో కొత్త ప్రోగ్రామ్‌లను అందుబాటులోకి తెచ్చారు. ఈ ప్రోగ్రాంలను అమలు చేయడానికి ఏఐసీటీఈ నుంచి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనుమతి పొందింది. అలాగే పాలకమండలి సభ్యులు కూడా ఆమోదం తెలిపారు. బీటెక్‌లో కంప్యూటర్ సైన్సెస్ డేటా సైన్సెస్, కంప్యూటర్ సైన్సెస్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లర్నింగ్ బ్రాంచ్‌ల ఏర్పాటుకు అప్పటి వీసీ ప్రొఫెసర్ కె.హుస్సేన్‌రెడ్డి చొరవ తీసుకున్నారు. సెల్ఫ్ ఫైనాన్స్ కింద నడిచే ఈ రెండు బీటెక్ ప్రోగ్రామ్‌లను ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రవేశపెట్టారు. ఒక్కో కోర్సులో 60 సీట్లు కేటాయించారు. ఇది వరకు ఉన్న ఈసీఈ, సీఎస్ఈ ప్రోగ్రాంలలో సీట్లను 60 నుంచి 120కు పెంచారు. ఈ విద్యా సంవత్సరంలో బీటెక్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు తీసుకునే విద్యార్థులు ఎస్కేయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో సీట్లు ఎంపిక చేసుకునేలా ఏపీఈఏపీసెట్ వెబ్ కౌన్సెలింగ్‌లో ఉన్నత విద్యామండలి అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ మేరకు ప్రిన్సిపాల్ రామచంద్ర తెలిపారు.

క్లుప్తంగా

కంప్యూటర్ కోర్సులపై ఉచిత శిక్షణ

అనంతపురం అగ్రికల్చర్: కంప్యూటర్ కోర్సులపై నిరుద్యోగ యువతకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. ఈ మేరకు ఆ ఫౌండేషన్ అడ్మిషన్స్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 10 పాస్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ ఫెయిల్ లేదా పాస్ అయి... 18 నుంచి 28 సంవత్సరాల వయసున్న వారు అర్హులు. బెంగళూరులో 35 రోజుల పాటు ఉచిత వసతి, భోజనంతో కూడిన శిక్షణను అందిస్తారు. కంప్యూటర్, ట్యాలీ కోర్సులతో పాటు స్పోకెన్ ఇంగ్లిషు, కంప్యూటర్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్ లాంటి అంశాలపై శిక్షణ ఉంటుంది. మరిన్ని వివరాలకు 90004 87423లో సంప్రదించవచ్చు.

దళితులపై దాడి

శెట్టూరు: మండలంలోని మాకోడికి గ్రామంలో దళితులపై అదే గ్రామస్తులు విచక్షణ రహితంగా దాడి చేశారు. బాధితులు తెలిపిన మేరకు.. శనివారం రాత్రి గ్రామంలో పీర్ల పెద్ద సరిగెత్తు కార్యక్రమం నిర్వహించారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన దళితులు గంగాధర, మల్లెల గంగాధర, మహేష్, రామాంజనేయులు పానకాల కుండలతో పీర్ల స్వాముల ఆలయంలోకి వెళ్లారు. ఇది గమనించిన తలారి వన్నూరుస్వామితో పాటు మరికొందరు ఆలయం బయటకు తోసి దాడికి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న సీఐలు యువరాజు, వంశీకృష్ణ గ్రామంలో పర్యటించి శాంతి భద్రతలు పర్యవేక్షించారు. కాగా, ఘటనపై ఇప్పటి వరకూ కేసు నమోదు చేయలేదని పోలీసులు తెలిపారు. అలాగే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దళితులను ఎమ్మార్పీఎస్ నాయకులు టైలర్ వన్నూరుస్వామి, చెలిమప్ప తదితరులు ఆదివారం పరామర్శించారు. దాడి చేసిన వారిపై అట్రాసిటీ కేసు నమెదు చేయాలని డిమాండ్ చేశారు.

వర్షం కోసం కప్పలకు పూజలు



కప్పలతో ఇంటింటికి తిరుగుతున్న చిన్నారులు

గుత్తి రూరల్: వర్షాలు కురవాలని కోరుతూ గుత్తి మండలం టి.కొత్తపల్లిలో ఆదివారం కప్పలకు పూజలు చేశారు. కప్పలను జోలెలో వేసుకొని చిన్నారులతో కలసి గ్రామస్తులు ఇంటింటికీ తిరిగి పూజలు చేయించారు. నెల రోజులుగా వర్షాలు మొహం చాటేయడంతో విత్తుకోవడానికి అదను దాటి పోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ముందుగా వేసిన పంటలు సైతం చినుకు జాడలేక ఎండిపోతున్నాయి. దీంతో వరుణ దేవుడు కరుణించి వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుకుంటూ కప్పలకు పూజలు చేశారు.

విశ్వ ఖ్యాతి.. అధోగతి

- తగ్గిపోతున్న జేఎన్‌టీయూ(ఏ) ప్రాభవం
- ఇప్పటికే 45 కళాశాలలకు అటానమస్
- వచ్చే ఏడాది అన్ని కళాశాలలకూ స్వయం ప్రతిపత్తి
- క్యాంపస్, పులివెందుల, కలికిరి కళాశాలలకే పరిమితం కానున్న వర్సిటీ



జేఎన్‌టీయూ (అనంతపురం) ఇంజినీరింగ్ కళాశాల

అనంతపురం: రాయలసీమకే తలమానికంగా భాసిల్లుతున్న జేఎన్‌టీయూ (అనంతపురం) క్రమంగా ప్రాభవం కోల్పోతోంది. అనుబంధ కళాశాలలన్నీ అటానమస్ (స్వయం ప్రతిపత్తి) హోదా పొందుతుండడంతో వర్సిటీ పాత్ర పరిమితం కానుంది. అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలలే వర్సిటీకి వెన్నుదన్ను. ఆయా కళాశాలల విద్యార్థులు చెల్లించే యూనివర్సిటీ కామన్ సర్వీసెస్ (యూసీఎస్) ఫీజులు వర్సిటీకి అతిపెద్ద ఆర్థిక వనరు. అయితే.. అనుబంధ కళాశాలల నుంచి స్వయం ప్రతిపత్తి కళాశాలలు (అటానమస్)గా మార్పు చెందుతున్నాయి. నూతన జాతీయ విద్యా విధానం–2020 ప్రకారం ప్రతి ఇంజినీరింగ్ కళాశాల అటానమస్‌గా మార్పు చెందాలని నిర్దేశించడం ఇందుకు ఊతంగా నిలుస్తోంది. జేఎన్‌టీయూ (అనంతపురం) పరిధిలో రాయలసీమ, నెల్లూరు జిల్లాలో మొత్తం 69 ఇంజినీరింగ్ కళాశాలలు అనుబంధంగా ఉండేవి. ఇందులో ఇప్పటికే 45 కళాశాలలు అటానమస్ హోదా దక్కించుకున్నాయి. మిగిలిన 24 ఇంజినీరింగ్ కళాశాలలు ప్రస్తుత (2025–26) విద్యా సంవత్సరానికి అనుబంధ కాలేజీలుగా వర్సిటీకి దరఖాస్తు చేసుకున్నాయి. వచ్చే సంవత్సరం నుంచి ఇవి కూడా స్వయం ప్రతిపత్తి పొందనున్నాయి. న్యాక్‌లో ఏ రకమైన గ్రేడ్ ఉన్నా అటానమస్ హోదా వస్తుంది. ఈ నేపథ్యంలో దరఖాస్తు చేసుకుంటే అటానమస్ హోదా ఇచ్చేస్తున్నారు. అనుబంధ కాలేజీలన్నీ అటానమస్ పొందితే జేఎన్‌టీయూ కేవలం క్యాంపస్ కళాశాల, పులివెందుల, కలికిరి, ఓటీపీఆర్ఐ కాలేజీలకే పరిమితం కానుంది.

వర్సిటీ బాధ్యతలు నామమాత్రం..

అనుబంధ కాలేజీలన్నీ అటానమస్ పొందితే జేఎన్‌టీయూ(ఏ) కేవలం డిగ్రీలు అందించే కార్యాలయంలా మారిపోనుంది. సిలబస్ రూపకల్పన, పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం, మార్కుల కేటాయింపులో అటానమస్ కళాశాలలు స్వతంత్రంగా వ్యవహరిస్తాయి. మార్కులు వర్సిటీకి పంపితే స్నాతకోత్సవ డిగ్రీ మాత్రం అందజేస్తుంది. ఈ నేపథ్యంలో వర్సిటీ బాధ్యతలు నామమాత్రం కానున్నాయి. ఒకప్పుడు ఏటా లక్ష మంది విద్యార్థులు వర్సిటీ కింద ఉండేవారు. ప్రస్తుతం ఆ సంఖ్య 10 వేలకు పడిపోయింది. వచ్చే ఏడాది మరింత తగ్గి కేవలం మూడు వేలకు పరిమితం కానుంది. దీంతో యూసీఎస్ ఫీజులు కూడా వర్సిటీకి రావు.

పురోగతికి కానరాని చర్యలు..

జేఎన్‌టీయూ (ఏ) పరిధిలో విద్యార్థులు లేని పరిస్థితి ఏర్పడనుంది. ఈ క్రమంలో క్యాంపస్ కళాశాలలో అడ్మిషన్లు గణనీయంగా పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కాలానుగుణంగా పరిశ్రమల అవసరాలకు తగిన మానవ వనరులను అందించే దిశగా ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలు సరికొత్త కోర్సులు అమలు చేస్తూ విద్యార్థులను ఆకర్షిస్తున్నాయి. అయితే 78 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన జేఎన్‌టీయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీలో భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి. ప్రతిభావంతులైన విద్యార్థులు చదువుకునే క్యాంపస్ కళాశాలలో కొత్త కోర్సుల అమలుకు యాజమాన్యం ఆసక్తి చూపడం లేదు. బీటెక్ కంప్యూటర్ సైన్సెస్ విభాగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లర్నింగ్ కోర్సును ప్రవేశపెట్టేందుకు 2023లోనే ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) నుంచి అనుమతి కూడా తీసుకున్నారు. పాలకమండలి ఆమోదం సైతం లభించింది. అయితే, ఇందుకు సంబంధించిన ఫైలు రాష్ట్ర ఉన్నత విద్యా మండలిలో పెండింగ్ పడిపోయింది. దీనిపై వర్సిటీ అధికారులు శ్రద్ధ పెట్టడం లేదు.

అనుమతి కోసం నిరీక్షణ



క్యాంపస్ కళాశాలలో బీటెక్ (ఏఐఎంఎల్) బ్రాంచ్‌ను ప్రవేశపెట్టేందుకు చర్యలు చేపట్టాం. ఈ బ్రాంచ్‌ను ప్రవేశపెడితే పేద ,మధ్య తరగతి విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్‌తోనే చదువుకోవచ్చు. ఉన్నత విద్యామండలి అనుమతి కోసం నిరీక్షిస్తున్నాం.

– ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు, వీసీ, జేఎన్‌టీయూ (అనంతపురం)

బస్సు ఢీకొని ఒకరి మృతి

- ఇద్దరు మహిళలకు తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన మహిళ

గార్లదిన్నె: కర్ణాటక ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు... కర్నూలు జిల్లా ఆదోని పట్టణానికి చెందిన షేక్ మహమ్మద్ హుస్సేన్ (45) శనివారం రాత్రి ఆటోలో అనంతపురం మార్కెట్ యార్డుకు చేరుకుని మొక్క జొన్న కంకులు లోడు చేసుకుని తిరుగు ప్రయాణమయ్యాడు. ఆదివారం వేకువజామున గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామ సరిహద్దున పెన్నానది బ్రిడ్జి వద్దకు చేరుకోగానే టైర్ పంచర్ అయింది. దీంతో రోడ్డు పక్కన ఆటోను నిలిపి టైర్ మారుస్తుండగా ఆటోలో ఉన్న ఖాజామొద్దీన్ సెల్ ఫోన్ లైట్ వెలుతురులో వాహనాలను మళ్లిస్తున్నాడు. పని పూర్తి కాగానే జాకీ కిందకు దింపే సమయంలో బెంగళూరు నుంచి మంత్రాలయానికి వెళుతున్న కర్ణాటక ఆర్టీసీ బస్సు శరవేగంగా దూసుకువచ్చింది. త్రుటిలో ప్రమాదం నుంచి ఖాజామొద్దీన్ తప్పించుకున్నాడు. బస్సు నేరుగా వెళ్లి ఆటోను వెనుక నుంచి ఢీకొంది. ఆటో డ్రైవర్ మహమ్మద్ హుస్సేన్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటో వెనుక కూర్చొని ఉన్న మరియమ్మ, ఉమాదేవి తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమయంలో అయిన శబ్దానికి స్థానికులు నిద్ర మేల్కొని అక్కడకు చేరుకున్నారు. తక్షణమే సహాయక చర్యలు చేపట్టి 108 అంబులెన్స్ ద్వారా క్షతగాత్రులను అనంతపురంలోని జీజీహెచ్‌కు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కర్నూలుకు వైద్యులు రెఫర్ చేశారు. కాగా, మృతుడు మహమ్మద్ హుస్సేన్‌కు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గౌస్ మహమ్మద్‌బాషా తెలిపారు.

కూటమి మోసాలను తిప్పికొడదాం

- రీకాలింగ్ చంద్రబాబూ మేనిఫెస్టో ద్వారా ప్రజల్లో చైతన్యం తెద్దాం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి



క్యూఆర్ కోడ్‌ను విడుదల చేస్తున్న అనంత వెంకట్రామిరెడ్డి, రమేష్‌గౌడ్ తదితరులు

అనంతపురం కార్పొరేషన్: ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను విస్మరించడం ద్వారా ఏడాదిలో రూ.81వేల కోట్లు ప్రజలకు చెల్లించకుండా సీఎం చంద్రబాబు చేసిన మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త సమర్థవంతంగా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి పిలుపునిచ్చారు. గత ప్రభుత్వంలో మనం చేసిన మేలును చెబుతూనే.. కూటమి దుశ్చర్యలను తిప్పికొట్టాలని సూచించారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం సోషల్ మీడియా విభాగం జిల్లా అధ్యక్షుడు నరేంద్రనాథ రెడ్డి అధ్యక్షతన జరిగిన సోషల్ మీడియా కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. పార్టీకి సోషల్ మీడియా ఎంతో బలమన్నారు. మహిళలు, రైతులు, యువత, వివిధ వర్గాల వారు పడుతున్న ఇబ్బందులపై ప్రజలను చైతన్య పరిచేదిశగా పోస్టింగ్‌లు ఉండాలని సూచించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాజకీయాలకతీతంగా రూ.2.80 లక్షల కోట్లు ప్రజల ఖాతాల్లో నేరుగా అందించిన విషయాన్ని ప్రజలకు తెలియజేద్దామన్నారు. సోషల్ మీడియా కార్యకర్తలకు భవిష్యత్తులో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో కూటమి ప్రభుత్వ పెద్దలు బరితెగించి అక్రమ కేసులు, అరెస్టులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. అయినా ఎవరూ భయపడాల్సిన పనిలేదన్నారు. కార్యకర్తలకు అండగా లీగల్, టాస్క్‌ఫోర్స్ టీంలను పార్టీ ఏర్పాటు చేసిందన్నారు. ప్రతి ఒక్కరూ ధైర్యంగా అడుగులు ముందుకేయాలని పిలుపునిచ్చారు. రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో కార్యక్రమాన్ని అనంతపురంలో ఈ నెల 20 నుంచి ప్రారంభిస్తున్నామని, బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్‌కు సంబంధించి విస్తృత స్థాయి ప్రచారం చేసి ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. అనంతపురం నియోజకవర్గంలో రూ.118 కోట్లు తెచ్చామని ప్రజాప్రతినిధులు గొప్పలు చెబుతున్నారని, ఇందుకు సంబంధించి ఏమైనా జీఓలు, ఉత్తర్వులను చూపమంటే కొంతమంది ఫ్రస్ట్రేషన్‌తో విమర్శలు చేస్తున్నారన్నారు.

అండగా ఉంటాం..

కూటమి ఆగడాలను నిర్భయంగా ప్రజల్లోకి తీసుకెళ్దామని, రెడ్‌బుక్ రాజ్యాంగంతో దౌర్జన్యాలకు ఎవరూ భయపడాల్సిన పనిలేదని టాస్క్‌ఫోర్స్ సభ్యుడు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌గౌడ్ పేర్కొన్నారు. ఎక్కడ ఎవరికి ఇబ్బంది కలిగినా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం సోషల్ మీడియా విభాగం జిల్లా అధ్యక్షుడు నరేంద్రనాథరెడ్డి, పార్టీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్‌రెడ్డి, బూత్ కమిటీ జిల్లా అధ్యక్షుడు ఎద్దుల అమర్‌నాథరెడ్డి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెన్నం శివరామిరెడ్డి, సోషల్ మీడియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాబా సలాం, యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు దాదాఖలందర్, తదితరులు మాట్లాడారు. జెడ్పీటీసీ నీలం భాస్కర్, నాయకులు తనీష, కేశవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● ప్రచార మత్తు..



కళ్యాణదుర్గంలోని బళ్లారి బైపాస్ వద్ద మద్యం షాప్ దూరాన్ని తెలిపేలా ఏర్పాటు చేసిన బోర్డు

ఎక్కడైనా కొత్త ప్రాంతానికి వెళుతున్నప్పుడు ఇబ్బంది పడకుండా ఉండేందుకు 'ఏటీఎం వంద మీటర్ల దూరంలో ఉంది, పెట్రోల్ బంకు 50 మీటర్ల దూరంలో ఉంది, పోలీసు స్టేషన్ 30 మీటర్ల దూరంలో ఉంది' అనే బోర్డులు రోడ్డు పక్కన కనిపించడం సర్వసాధారణం. అయితే ఇందుకు భిన్నంగా కళ్యాణదుర్గంలో మాత్రం టీడీపీ నేతలు ఏకంగా బళ్లారికి వెళ్లే రింగ్ రోడ్డు పక్కనే మద్యం దుకాణం 50 మీటర్ల దూరంలో ఉందంటూ బోర్డు పెట్టేశారు. దీనికి తోడు రింగ్ రోడ్డు సమీపంలో గతంలో జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహం ఏర్పాటు చేసి మహాత్మాగాంధీ సర్కిల్‌గా నామకరణం చేశారు. మహాత్మునికి కూడా కనీస గౌరవం ఇవ్వకుండా విగ్రహానికి కేవలం 30 అడుగుల దూరంలోనే మద్యం దుకాణం తెరిచారు. ఇది చూసిన ప్రజాసంఘాల నాయకులు, సామాజిక వేత్తలు విస్తుపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – సాక్షి, టాస్క్‌ఫోర్స్:



మహాత్మాగాంధీ విగ్రహం పక్కన ఏర్పాటు చేసిన మద్యం దుకాణం

● అ'పూర్వ' సమ్మేళనం



నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

పామిడి: స్థానిక టీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1981–82లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు అదే పాఠశాల వేదికగా ఆదివారం కలుసుకున్నారు. 43 ఏళ్ల తర్వాత రెండో సారి కలుసుకున్న వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. తమకు విద్యాబుద్ధులు నేర్పిన నాటి గురువులు ప్రభాకర్, వెంకరమణప్పను ఘనంగా సత్కరించి, ఆశీర్వాదం తీసుకున్నారు. ఒకరి బాగోగులను ఒకరు అడిగి తెలుసుకున్నారు. సామూహిక భోజనాలతో సందడి చేశారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు డీఎస్ఎం వరప్రసాద్, ఆసిఫ్, వెంకన్నరావు, శ్రీనివాసరావు, రాధాకృష్ణ, నగేష్, ఆర్ఎంపీ మైనుద్దీన్, రమేష్, భాస్కర్, ఖాజామొహిద్దీన్, మస్తాన్, ప్రేమ, వహిద తదితరులు పాల్గొన్నారు.

పి.నారాయణపురానికి జాతీయ స్థాయి గుర్తింపు



గ్రీన్ అంబాసిడర్లతో కలిసి చెత్త సేకరణ చేయిస్తున్న సర్పంచ్ హనుమంత రెడ్డి

కూడేరు: మండలంలోని పి.నారాయణపురం గ్రామ పంచాయతీకి జాతీయ స్థాయి గుర్తింపు దక్కింది. జాతీయ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ఆ గ్రామ సర్పంచ్ హనుమంతరెడ్డి ద్వితీయ స్థానంలో విజేతగా నిలిచి, రూ.25 వేల పారితోషికాన్ని గెలుచుకున్నారు. వివరాల్లోకి వెళితే... సర్పంచ్ సంవాద్ పేరిట భారత నాణ్యత మండలి సర్పంచులందరినీ ఒకే వేదిక పైకి తీసుకు వచ్చేందుకు ప్రత్యేకంగా యాప్‌ను తీసుకొచ్చింది. గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందాలంటే ఏమి చేస్తే బాగుంటుంది. అనుసరించాల్సిన విధానాలను వీడియో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని కేంద్రం సూచించింది. ఈ ఏడాది జూన్‌లో సర్పంచ్ హనుమంతరెడ్డి ఓ వీడియో సందేశాన్ని పంపి తన ఆలోచనా విధానాన్ని పంచుకున్నారు. అధికారులను సమన్వయం చేసుకుని గ్రామంలో ఇంటింటికి స్వచ్ఛమైన నీరందించడం, బాధ్యతగా చెత్త సేకరణ, అందులో నుంచి తడి పొడి చెత్తను వేరు చేయడం, తద్వారా వర్మీ కంపోస్టు ఎరువు చేసి సంపద సృష్టించే అంశాలను వివరించారు. ఈ వీడియోను పరిశీలించిన భారత నాణ్యత మండలి... సర్పంచ్ ఆలోచన తీరును మెచ్చుకుంది. జాతీయ స్థాయిలో సర్పంచ్ హనుమంతరెడ్డిని రెండవ విజేతగా ప్రకటించింది. ఈ విషయాన్ని ఆయన ఆదివారం 'సాక్షి'కి వెల్లడించారు. మారుమూల పంచాయతీకి జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం తనకెంతో ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

దిగజారుతున్న విద్యా ప్రమాణాలు

- ఎస్టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి రామాంజనేయులు



మాట్లాడుతున్న రామాంజనేయులు

అనంతపురం ఎడ్యుకేషన్: మెగా పీటీఎం, యోగాంధ్ర, ట్రైనింగులు తదితర బోధనేతర కార్యక్రమాలకు ఉపాధ్యాయులను మళ్లించడంతో రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు పడిపోతున్నాయని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజనేయులు ఆందోళన వ్యక్తం చేశారు. కాకినాడ వేదికగా ఎస్టీయూ రాష్ట్ర ద్వితీయ కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. జిల్లా నుంచి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శితో పాటు పలువురు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి .రామాంజనేయులు మాట్లాడారు. ప్రశాంతమైన వాతావరణంలో బోధన అభ్యసన కార్యక్రమాలు జరిగేలా విద్యాశాఖ దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు 11వ పీఆర్సీ బకాయిలు చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలు, 12వ పీఆర్సీ వేసి వెంటనే ఐఆర్ ప్రకటించాలన్నారు. అలాగే సీపీఎస్ బకాయిలు చెల్లించాలని, సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్మెంట్ మూడేళ్లయినా చెల్లించలేదన్నారు. పురపాలక, నగరపాలక పాఠశాలల్లో మిగిలిపోయిన స్కూల్ అసిస్టెంట్ పోస్టులను అర్హత కలిగిన ఉపాధ్యాయులతో నెలవారీ ప్రమోషన్ల ద్వారా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

టిప్పర్ ఢీ - వృద్ధుడి మృతి

ముదిగుబ్బ: టిప్పర్ ఢీ కొనడంతో ముదిగుబ్బ మండలం రామస్వామినాయక్ తండాకు చెందిన శ్రీనివాసులునాయక్‌ను(62) దుర్మరణం పాలయ్యాడు. స్వగ్రామం నుంచి ముదిగుబ్బ–పుట్టపర్తి రహదారిపై ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన టిప్పర్ ఢీకొంది. మృతునికి భార్య తులసీబాయి, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆంధ్రా క్రికెట్ జట్టులో చోటు



కోగటం హనీష్ వీరారెడ్డి



జయంత్‌కృష్ణ



ఎం.భువనేశ్వర్



టీవీ సాయి ప్రతాపరెడ్డి



ఎస్.రెహాన్

అనంతపురం: ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకూ ఎన్టీఆర్ జిల్లా, ఇబ్రహీంపట్నం మండలం మూలపాడులో జరిగే వన్డే క్రికెట్ పోటీల్లో ప్రాతినిథ్యం వహించే ఆంధ్రా అండర్–19 పురుషుల క్రికెట్ జట్టులో జిల్లాకు నుంచి ఐదుగురికి చోటు దక్కింది. వీరిలో కోగటం హనీష్ వీరారెడ్డి, టీవీ సాయి ప్రతాపరెడ్డి, ఎ.జయంత్ కృష్ణ (తాడిపత్రి), ఎం.భువనేశ్వర్ (గుత్తి), ఎస్.రెహాన్ (గుంతకల్లు) ఉన్నారు.

● 'వజ్ర' సంకల్పం



అన్వేషణలో అలసి కూర్చొండిపోయిన మహిళలు

మెరిసే రాళ్లను పరిశీలిస్తున్న యువకుడు

వజ్రకరూరు పరిసరాల్లో వజ్రాల వేట కొనసాగుతోంది. ఆదివారం సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చి వజ్రాల వేటలో మునిగారు. ఒక్క వజ్రం లభించినా తమ తలరాత మారుతుందనే అభిప్రాయం అందరిలోనూ వ్యక్తమైంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు కర్ణాటక, తెలంగాణ, నెల్లూరు, చిత్తూరు తదితర ప్రాంతాల నుంచి ప్రజలు ఆటోలు, బస్సులు, ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాల్లో తరలివచ్చారు. చిన్నారుల మొదలు వృద్ధుల వరకూ వయో భేదం లేకుండా ఉదయం నుంచి సాయంత్రం వరకు పొలాల్లోనే వజ్రల కోసం అన్వేషించారు. వీరిలో చంటి బిడ్డల తల్లుల కూడా ఉన్నారు. – వజ్రకరూరు:



పొలాల్లో గాలిస్తున్న మహిళలు



మెరిసే రాళ్లను సేకరిస్తున్న వ్యక్తి

క్లుప్తంగా

బ్రాహ్మణ వసతి గృహం నూతన కమిటీ ఎంపిక



మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

అనంతపురం కల్చరల్: దశాబ్దాలుగా బ్రాహ్మణ విద్యార్థులకు సేవలందిస్తున్న సీనియర్ అడ్వకేట్ రామసుబ్రహ్మణ్యం బ్రాహ్మణ వసతి గృహం నూతన కమిటీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆదివారం మూడవ రోడ్డులోని బ్రాహ్మణ విద్యార్థి వసతి గృహంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎన్నికల అధికారి సుందరేశం ఆధ్వర్యంలో ఉపాధ్యక్షులుగా శరదిందు, రాఘవేంద్రజోషి, ప్రధాన కార్యదర్శులుగా సంధ్యావందనం బద్రీనాథ్, సహాయ కార్యదర్శులుగా సత్యనారాయణ, వెంకట నారాయణ, ట్రెజరర్‌గా పాణ్యం శ్రీధర్, ఎక్స్ అఫిషియో మెంబరుగా సుంకేశుల సత్యనారాయణ తదితరులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వసతి గృహంలో మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు.

వీకే పార్వతమ్మ ఇకలేరు



వీకే పార్వతమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

అనంతపురం అర్బన్: స్వాతంత్ర సమరయోధుడు, సీపీఐ అగ్రనేత వీకే ఆదినారాయణ రెడ్డి సతీమణి వీకే పార్వతమ్మ ఆదివారం తదిశ్వాస విడిచారు. స్థానిక మొదటి రోడ్డులో ఆమె మృతదేహానికి సీపీఐ నాయకులు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అలాగే సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ సంతాపం ప్రకటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శులు నారాయణ స్వామి, మల్లికార్జున, కార్యవర్గ సభ్యులు రాజారెడ్డి, కేశవరెడ్డి, నాయకులు శ్రీరాములు, లింగమయ్య, రమణ, కృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ



కప్ అందజేస్తున్న బీఎస్ఎన్ఎల్ డీజీఎం బాలగంగాధర్ రెడ్డి

అనంతపురం సిటీ: నగరంలోని పీటీసీ మైదానంలో నిర్వహించిన బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. బీఎస్ఎన్ఎల్ ప్రొడక్ట్స్ ప్రమోషన్‌లో భాగంగా ఆ శాఖ ఉమ్మడి జిల్లా జనరల్ మేనేజర్ షేక్ ముజీబ్ పాషా ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. బీఎస్ఎన్ఎల్ రాయల్స్, బీఎస్ఎన్ఎల్ రైజర్స్ జట్ల మధ్య ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో బీఎస్ఎన్ఎల్ రాయల్ జట్టు విజయం సాధించింది. కెప్టెన్ టి.రాజ మహేశ్, జట్టు సభ్యులకు డీజీఎం బాలగంగాధర్‌రెడ్డి కప్ అందజేశారు. కార్యక్రమంలో ఏజీఎంలు గోపాల్, బాలాజీ, ఉమ్మడి జిల్లా ఉద్యోగులు పాల్గొన్నారు.

కళ్యాణమ్మ ఆశయ సాధనకు కృషి



కళ్యాణమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యజమాన్యం

రాప్తాడు: గొల్లపల్లి సమీపంలోని మాంటిస్సోరి ఎలీట్ పాఠశాలలో ఆదివారం మాంటిస్సోరి పాఠశాలల వ్యవస్థాపకురాలు, విద్యా ప్రదాత కళ్యాణమ్మ 13వ వర్ధంతి నిర్వహించారు. రక్తదాన శిబిరం, కంటి వైద్య శిబిరంతో పాటు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. తొలుత కళ్యాణమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ఎండీ భరత్ మాట్లాడుతూ.. పాఠశాల వ్యవస్థాపకురాలు కళ్యాణమ్మ ఆశయ సాధనకు కృషి చేస్తామన్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడం మన బాధ్యత అని పేర్కొన్నారు. పాఠశాల కరస్పాండెంట్ సమీరా మాట్లాడుతూ.. ప్రాథమిక స్థాయి నుంచే ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం సాధించవచ్చని తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు నైతిక విలువలు నేర్పిస్తున్నామన్నారు. విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యనందించడమే తమ ధ్యేయమన్నారు. విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలంటే ఉపాధ్యాయుల బోధన, తల్లిదండ్రుల సహకారం తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ కర్తదానం చేసి ప్రాణదాతలు కావాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కూలేందుకు సిద్ధం.. కదలని దస్త్రం



- ఆత్మకూరులో శిథిలావస్థకు చేరిన ఓవర్‌హెడ్ ట్యాంక్
- నివేదికలు పంపినా పట్టించుకోని జేఎన్‌టీయూ ల్యాబ్ అధికారులు
- ట్యాంక్ కిందనే ప్రభుత్వ పాఠశాల నిర్వహణ
- భయాందోళన చెందుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఆత్మకూరు: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్ శిథిలావస్థకు చేరుకుంది. ట్యాంక్ పూర్తిగా దెబ్బతిని మొత్తం చీలికలు రావడంతో ప్రమాదకరంగా తయారైంది. ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, ఓవర్ హెడ్ ట్యాంక్ ఒకే కాంపౌండ్‌లో ఉన్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. కొన్ని నెలల క్రితం అంగన్‌వాడీ కేంద్రాన్ని అక్కడి నుంచి మరో చోటికి మార్చారు. అయితే ప్రస్తుతం ఆ ట్యాంక్ కింద ప్రభుత్వ పాఠశాల ఉంది. ఆ పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు 30 మంది విద్యార్థులు చదువుతున్నారు. ట్యాంక్ శిథిలావస్థకు చేరడంతో చాలా మంది తల్లిదండ్రులు భయపడి విద్యార్థులను ఇతర పాఠశాలల్లోకి చేర్పించారు. పిల్లలు అన్నం తినాలన్నా, చదువుకోవాలన్నా, ఆడుకోవాలన్నా, మరుగుదొడ్డికి వెళ్లాలన్నా ఆ ట్యాంక్ కిందనే వెళ్లి రావాల్సి ఉంటుంది. దీంతో అక్కడున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఆత్మకూరు సర్పంచ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఈ విషయంపై జేఎన్టీయూ ల్యాబ్‌కు సమాచారం ఇచ్చారు. సమస్యను పరిష్కరించాలని ఐదు నెలలుగా తిరుగుతున్నా ల్యాబ్ సిబ్బంది స్పందించడం లేదు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న జేఎన్‌టీయూ ల్యాబ్ అధికారులు

ఓవర్‌హెడ్ ట్యాంక్ ప్రమాదకరంగా ఉందని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నత అధికారుల దృష్టికి తెసుకెళ్లారు. స్పందించిన ఎంఈఓ నరసింహారెడ్డి, సర్పంచ్ వరలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్ ట్యాంక్‌ను పరిశీలించారు. ట్యాంక్ సామర్థ్యాన్ని పరిశీలించాలంటూ ఐదు నెలలు క్రితం జేఎన్‌టీయూ ల్యాబ్‌కు లెటర్ పంపించారు. అయితే ఇప్పటి వరకూ ల్యాబ్ సిబ్బంది ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను పరిశీలించిన దాఖలాలు లేవు. ట్యాంక్ నుంచి తీసుకున్న మెటీరియల్‌ను ల్యాబ్‌లో పరిశీలించాల్సి ఉంటుంది. దీనిని బట్టి ఆ ట్యాంక్‌ను ఉంచాలా? మరమ్మతులు చేయించాలా ? లేదా దానిని కూల్చేసి కొత్తది నిర్మించాలా? అన్నది ల్యాబ్ అధికారులు ఇచ్చే నివేదికను బట్టి ఉంటుంది. అయితే ల్యాబ్ సిబ్బంది మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ఏమైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ప్రమాదకరంగా ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్

అధికారులు పట్టించుకోలేదు

ఎస్సీ కాలనీలో ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు చీలికలు వచ్చాయి. శిథిలావస్థకు చేరుకుంది. ఏదైనా అనుకోకుండా ప్రమాదం జరిగితే అంతే సంగతులు. పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు భయపడుతున్నారు. ట్యాంక్‌ను తొలగించి కొత్తది ఏర్పాటు చేయాలని ఉన్నతస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అయినా వారు పట్టించుకోవడం లేదు.

– రాజశేఖర్, ఆత్మకూరు

ల్యాబ్ సిబ్బంది రాలేదు

ఓవర్‌హెడ్ ట్యాంక్ ప్రమాదకరంగా ఉందని తెలిసిన వెంటనే పరిశీలించాం. ట్యాంక్‌కు చీలికలు వచ్చిన మాట వాస్తవమే. అయితే జేఎన్‌టీయూ ల్యాబ్ సిబ్బంది ట్యాంక్‌ను పరిశీలించాల్సి ఉంది. మెటీరియల్‌ను తీసుకెళ్లి ల్యాబ్‌లో పరిశీలిస్తే ఏం చేయాలన్న విషయం తెలుస్తుంది.

– శివకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

ఆర్డీటీ సంరక్షణ అందరి బాధ్యత

అనంతపురం కల్చరల్: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అండగా నిలిచిన ఆర్డీటీని కాపాడుకోవడం అందరి బాధ్యత అని సీనియర్ రచయిత శాంతి నారాయణ అన్నారు. ఆదివారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో రచయితలు, కవులు, మేధావులు చర్చా వేదిక నిర్వహించారు. రచయిత రాయుడు అధ్యక్షతన జరిగిన వేదికలో భాగంగా ×విద్య, వైద్యంలో అనంతకు బాసట, ఎయిడ్స్ వ్యాధి గ్రస్తులకు చేయూతలో ఆర్డీటీ పాత్ర% అనే అంశంపై డాక్టర్ శాంతినారాయణ ప్రసంగించారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ చేయాలని డిమాండ్ చేశారు. ఆర్డీటీ క్రీడల విస్తరణ, అంతర్జాతీయ ప్రాముఖ్యత, అనంత అవసరం, ఆర్డీటీ మహిళాభ్యుదయం విశేష ప్రగతి, సామాజిక మార్పు, అనివార్యత, అనంత జిల్లాలో కళలు, సంగీతం, నృత్యంలో ఆర్డీటీ విశేష కృషి తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో వంకిరెడ్డి రెడ్డప్పరెడ్డి, ఉప్పరపాటి వెంకటేశులు, మహబూబ్‌ఖాన్, తిప్పేస్వామి, హనుమంతరాయుడు, డాక్టర్ వంశీకృష్ణ, ఆదవాల శేషగిరి రాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయ భవన్‌లో మాట్లాడుతున్న రచయితలు, కవులు

నష్టపరిహారం తక్షణమే చెల్లించాలి

ఆత్మకూరు: జీడిపల్లి నుంచి పేరూరు డ్యాంకు భూములు ఇచ్చిన రైతులకు తక్షణమే నష్టపరిహారం అందించాలి. కాలువ నిర్మాణం పూర్తి చేసి నీరు ఇవ్వాలని సీపీఐ జిల్లా సహాయక కార్యదర్శి చిరుతల మల్లికార్జున డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో సీపీఐ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. తొలుత సీపీఐ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మల్లికార్జున మాట్లాడుతూ.. జిల్లాలో హంద్రీ-నీవా ద్వారా వెంటనే పొలాలకు నీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు హామీలు ఇచ్చి.. గెలిచాక మోసం చేస్తోందని మండిపడ్డారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు రూ.20 వేలు నగదు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయకట్టుకు సాగు నీరు అందించడానికి ప్రభుత్వం తక్షణమే పిల్ల కాలువలను తీసి నీరు అందించకపోతే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం హంద్రీ–నీవా కాలువకు లైనింగ్ చేసి రైతులకు తీరని అన్యాయం చేస్తోందని విమర్శించారు. గతంలో పేరూరు డ్యాంకు నీరు ఇస్తామన్న చంద్రబాబు.. ఇప్పటికీ కాలువ పనులు పూర్తి చేయలేదని గుర్తు చేశారు. భూములు ఇచ్చిన రైతులకు ఇంత వరకు నష్టపరిహారం కూడా అందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మండల కార్యదర్శి రామకృష్ణ, రామాంజనేయులు, ఓబులేసు, గోపాల్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చిరుతల మల్లికార్జున

‘వడ్డీ వ్యాపారుల దౌర్జన్యాలు అరికట్టాలి’

అనంతపురం టవర్‌క్లాక్: పేద ప్రజలను జలగల్ల పట్టిపీడిస్తున్న అధిక వడ్డీ వ్యాపారుల దౌర్జన్యాలు అరికట్టాలని అధిక వడ్డీల వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు సాకే హరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధిక వడ్డీ వ్యాపారుల అక్రమాలకు పోలీసులు క్లైం వేయాలని కోరారు. అలాగే అధిక వడ్డీలు ఇచ్చే ప్రాంతాలను గుర్తించి వ్యాపారులకు కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. వడ్డీ వ్యాపారుల తీరు మారకపోతే చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అధిక వడ్డీలు డబ్బు ఇచ్చే వ్యాపాలరులపై పీడీ యాక్ట్ పెట్టి, ఆస్తులు జప్తు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సింగం సదాశివ రెడ్డి, కార్యదర్శులు జేఎం బాషా, సుగమంచి శ్రీనివాసులు, కోశాధికారి మనోహర్‌రెడ్డి, సభ్యులు సూర్యనారాయణ, మహ్మద్ రఫీ, ఏసుపాదం, శివానంద తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ‘సంధ్యా రవళి’




సంధ్యామూర్తిని సత్కరిస్తున్న డ్యాన్స్ మాస్టర్లు

అనంతపురం కల్చరల్: అనంత వేదికగా ‘సంధ్యా రవళి’ పేరిట సాగిన నేషనల్ డ్యాన్స్ ఫెస్టివల్ ఆద్యంతం ఆకట్టుకుంది. స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో 12 గంటల నిర్విరామ శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు అలరించాయి. సంధ్యామూర్తి చిన్నారులతో కలిసి చేసిన నాట్యం అందరిలో ఉత్సాహం నింపింది. వివిధ నాట్యరీతులతో ఆకట్టుకున్న గురువులకు ‘నర్తన ఆచార్య’ చిన్నారులకు ‘నర్తనబాల’ అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, మాజీ మేయర్ స్వరూప, డాక్టర్ శ్రీనివాస్ పోతినేని, డాక్టర్ బాలాకుమారి, నాట్యోత్సవ కమిటీ నిర్వాహకులు నందకుమార్, శ్రీనిధి రఘు, అనిల్‌కుమార్‌రెడ్డి, హరిప్రసాద్, మహాలక్ష్మి పాల్గొన్నారు.

ముగిసిన మొహర్రం వేడుకలు

రాప్తాడు: మండలంలోని గాండ్లపర్తి, బొమ్మేపర్తి, పాలబావి గ్రామాల్లో మొహర్రం వేడుకలు ఘనంగా ముగిశాయి. ఆదివారం పీర్ల జలధి ఉత్సవాన్ని ఆయా గ్రామాల్లో హిందూ, ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెద్ద సరిగెత్తు సందర్భంగా పీర్ల దేవుళ్లను రకరకాల పూలతో అలంకరించి చదివింపులు చేశారు. ఆయా గ్రామాల్లో భక్తులు చెట్లను తీసుకువచ్చి పీర్ల చావిడి ముందు ఏర్పాటు చేసిన అగ్ని గుండంలోకి వేసి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామాల్లో యువకులు అగ్నిగుండం ముందు తప్పెట్లు కొట్టుకుంటూ ఉత్సాహంగా అలావ్ తొక్కారు. సాయంత్రం పీర్ల దేవుళ్లను గ్రామాల్లో ఊరేగించి జలధికి తీసుకెళ్లారు. సీఐ శ్రీహర్ష ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.



జలధికి తరలుతున్న పీర్లు

వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యం

రాప్తాడు: వైఎస్సార్‌సీపీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కష్టపడి పని చేయాలని పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాల్యవంతం పెన్నోబులేష్ సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆర్డీటీ కమ్యూనిటీ భవనంలో పార్టీ ఎస్సీ సెల్ మండల కన్వీనర్ జూటూరు లక్ష్మన్న ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ గ్రామ, మండల, జిల్లా స్థాయి కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కష్టపడిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని తెలిపారు. నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలందరం ఒక తాటిపైకి వచ్చి మళ్లీ తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎం అయితేనే బడుగు బలహీన వర్గాలకు భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఎస్సీలపై ఎక్కువగా దాడులు జరుగుతున్నాయన్నారు. రామగిరి మండలంలోని ఏడుగుర్రాలపల్లిలో ఒక దళిత బాలికపై టీడీపీ నాయకులు సామూహిక అత్యాచారం చేయడం జరిగిందన్నారు. రాప్తాడు ఎమ్మెల్యే ఒక మహిళ అయినా ఆ యువతిని ఇంత వరకు పరామర్శించిన పాపాన పోలేదన్నారు. బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు మాట్లాడుతూ.. కృష్ణ జిల్లా గుడివాడలో జెడ్పీ చైర్‌పర్సన్, బీసీ మహిళ హారిక, ఆమె భర్తను ఒకటిన్నర గంట పాటు టీడీపీ, జనసేన పార్టీ నాయకులు నిర్బంధించి వాహనాన్ని ధ్వంసం చేయడం దుర్మార్గమన్నారు. ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఓబులేష్, మాజీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ మండల కన్వీనర్ బుడ్డారెడ్డి గారి విశ్వనాథ్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సాకే చంద్ర, చిరుతల నాగేంద్ర, మన్నల రవికుమార్, చింతకాయల జయన్న, పూజారి ఓలయ్య, నాగరాజు, రాముడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పెన్నోబులేష్

దగ్గుపాటివి చౌకబారు రాజకీయాలు

అనంతపురం కార్పొరేషన్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.వెయ్యి కోట్లకుపైగా అభివృద్ధి పనులు చేసిన అప్పటి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిపై టీడీపీ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ చేసిన వ్యాఖ్యలు సరికాదు. దగ్గుపాటి ఓ సంస్కారహీనుడని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెన్నోబులేసు ధ్వజమెత్తారు. దగ్గుపాటికి చేతనైతే ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలన్నారు. చౌకబారు రాజకీయాలు మానుకోకపోతే ప్రజాస్వామ్య పద్ధతిలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డిని విమర్శించే అర్హత లేదన్నారు.

‘ఉపాధ్యాయులను వేధించడం సరికాదు’

అనంతపురం ఎడ్యుకేషన్: ‘మెగా పీటీఎం’ కార్యక్రమానికి సంబంధించి ఆన్‌లైన్‌లో ఫొటోలు సరిగా అప్‌లోడ్ చేయలేదంటూ ఉపాధ్యాయులను వేధించడం సరికాదని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా అధ్యక్షుడు నీలూరి రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజనేయులు మండిపడ్డారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఫొటోలను సరి చేసేందుకు హెచ్ఎంలను ఎమ్మార్సీలకు పిలిపించడం దుర్మార్గమన్నారు. ఇలాంటి పద్ధతులను మానుకోవాలని హితవు పలికారు.

సంతల ఆదాయం రూ.3.37 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో ఈ వారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రూ.3.37 లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్లు సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ కె.గోవిందు తెలిపారు. అందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకలు, పొట్టేళ్ల సంత ద్వారా రూ.1,93,390 వసూలు కాగా.. ఆదివారం జరిగిన పశువులు, ఎద్దుల సంత ద్వారా రూ.1,44,400 మేర వసూలైనట్లు పేర్కొన్నారు.

ట్రూఅప్ చార్జీలు రద్దు చేయాలి

అనంతపురం అర్బన్: విద్యుత్ వినియోదారులపై భారాలు మోపే చర్యలను ప్రభుత్వం ఉపసంహరించుకోలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, ట్రూఅప్ చార్జీల రద్దు చేయాలంటూ సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో నాయకులు ఆదివారం నగరంలోని పలు కాలనీల్లో

సంక్షిప్త సమాచారం

ప్రచారం చేస్తూ కరపత్రాలు అందజేశారు. కరపత్రంలోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా ఫిర్యాదు నేరుగా ముఖ్యమంత్రికి వెళుతుందని తెలిపారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి రామిరెడ్డి, నాయకులు ఇర్ఫాన్, ఎర్రిస్వామి, లక్ష్మీనారాయణ, తదితరులు ఆపాల్గొన్నారు.

కోట శ్రీనివాసరావు మృతి బాధాకరం

అనంతపురం కల్చరల్: దశాబ్దాలుగా తెలుగు సినీ రంగానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చి విలక్షణ నటనతో ఆకట్టుకున్న కోట శ్రీనివాసరావు మృతి కళారంగానికి తీరని లోటని సీనియర్ రంగస్థల నటుడు, కనకరత్న అవార్డు గ్రహీత కోటి మల్లేష్ అన్నారు. కురుబ కళాకారుల సంఘం తరుపున కోట శ్రీనివాసరావు మృతికి సంతాపం తెలిపారు. కోట శ్రీనివాస రావు పేరిట నాటకాలు ఆడాలని తీర్మానించినట్లు కళాకారులు వెల్లడించారు.

గుత్తి రామకృష్ణ విగ్రహ ఏర్పాటుకు కృషి

అనంతపురం కల్చరల్: స్థానిక కృష్ణకళా మందిరంలో ఆదివారం జర్నలిస్టుగా విశేష సేవలందించిన గుత్తి రామకృష్ణ జయంతి నిర్వహించారు. జిల్లాలో గుత్తి రామకృష్ణ స్ఫూర్తిదాయక సేవలను గుర్తు చేసుకున్నారు. ఆయన విగ్రహ ఏర్పాటుకు అందరూ కృషి చేయాలని తీర్మానించారు. కార్యక్రమంలో గుత్తి ఆనందవర్ధన్, తెలుగు వెలుగు టీవీ రెడ్డి, తోట నాగరాజు, మహాబోధి దాసన్నగారి కృష్ణమూర్తి, ద్విభాషా కవి జూటూరు షరీఫ్, గిరిధర రాయ్, చెట్ల ఈరన్న, రియాజుద్దీన్, సింగరాయని శ్రీనివాసులు, కేపీ రాజు, అల్తాఫ్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నవశక్తి పూజలు

అనంతపురం కల్చరల్: కళ్యాణదుర్గం రోడ్డులోని శివశక్తి ఆలయం వేదికగా ఆదివారం అవోపా (ఆర్యవైశ్య అఫిషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్) మహిళా విభాగం ఆధ్వర్యంలో నవశక్తి పూజలు, శాకంబరీ ఉత్సవం, పాతకాలపు ఆటలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో గూడూరు అనురాధ, కాకుమాని చంద్రకళ, రమాదేవి, మేడా కృష్ణవేణి, విజయలక్ష్మి, పుష్పాంజలి, శిరీష, త్రివేణి, హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటు

రాప్తాడు: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో రైతులు, ప్రజలకు చేసింది శూన్యం. హామీలు అమలు చేయకుండా సుపరిపాలన తొలి అడుగు అంటూ గ్రామాల్లో సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటు అని సీపీఐ మండల కార్యదర్శి ఆర్.రవీంద్ర మండిపడ్డారు. ఆదివారం మండలంలోని గొందిరెడిపల్లి గ్రామంలో సీపీఐ శాఖ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్నదాత సుఖీభవ పథకం కింద సంవత్సరానికి రూ.20 వేలు రైతుల ఖాతాలో జమ చేస్తామని చెప్పి ఏడాది అవుతున్నా ఒక్క రూపాయి కూడా జమ చేయలేదన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌పై దాడి హేయం

రాప్తాడురూరల్: కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్, బీసీ మహిళ ఉప్పాల హారికపై టీడీపీ గూండాలు దాడి చేయడం హేయం అని చెన్నేకొత్తపల్లి మాజీ మండల అధ్యక్షురాలు శ్రీశైలం ప్రవీణ మండిపడ్డారు. ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లా ప్రథమ పౌరురాలు, బీసీ మహిళ అనే కనీస గౌరవం లేకుండా టీడీపీ మూకలు దాడి చేయడం దారుణమన్నారు. రాష్ట్రంలో పూర్తిగా అదుపుతప్పిన శాంతిభద్రతలకు ఇదే తార్కాణం అన్నారు. జిల్లా ప్రథమ పౌరురాలికే రక్షణ లేకపోతే ఇక సామాన్య మహిళలు రక్షణ ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆత్మకూరు: కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై టీడీపీ గూండాలు దాడి చేయడం హేయమైన చర్య అని ఎంపీపీ హేమలత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, శాంతి భద్రతలు క్షీణించాయని తెలిపారు. అన్యాయం జరిగితే ప్రశ్నిస్తానన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇప్పుడు ఎక్కడికి పోయారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంలో ఒక జిల్లా ప్రథమ పౌరురాలికే రక్షణ కల్పించలేకపోతే ఇక సామాన్య మహిళలకు ఎలా రక్షణ కల్పిస్తారని నిలదీశారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుని శిక్షించాలని డిమాండ్ చేశారు.

మొక్కలను సంరక్షించాలి



మొక్కకు నీరు పోస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: కేంద్రీయ విద్యాలయంలో మూడో తరగతి చదువుతున్న సుంకర నవని కోరిక మేరకు జిల్లా పరిషత్ క్యాంపస్‌లో ఆదివారం జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ వివిధ రకాల మొక్కలు నాటారు. ఏక్ పేడ్ మాకే నామ్ సే (తల్లి పేరు మీద ఒక మొక్క నాటుదాం) అనే నినాదంలో భాగంగా మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. అప్పుడే గ్రీన్ అనంతపురం, గ్రీన్ ఆంధ్ర, గ్రీన్ ఇండియా సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

రాయలసీమను ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలి

అనంతపురం టవర్‌క్లాక్: రాయలసీమను ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలి. లేని పక్షంలో కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించాలని రాయలసీమ రాష్ట్ర సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కుంచం వెంకట సుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీవో హోంలో రాయలసీమ రాష్ట్ర సమితి పార్టీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాయలసీమ అభివృద్ధికి రూ.10 లక్షల కోట్లు కేటాయించేందుకు ప్రభుత్వం ముందుకు రావాలన్నారు. రైల్వే జోన్‌ను గుంతకల్లుకు మార్చాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. రాయసీమలోని అన్ని పరిశ్రమలల్లో సీమ నిరుద్యోగులకు 80 శాతం ఉద్యోగాలు కేటాయించి న్యాయం చేయాలన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి



వైఎస్సార్‌టీఏ జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి మద్దతు కోరుతున్న 2003 డీఎస్సీ టీచర్ల ఫోరం సభ్యులు

అనంతపురం ఎడ్యుకేషన్: 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.నాగిరెడ్డి డిమాండ్ చేశారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయుల ఫోరం నాయకులు ఆదివారం నాగిరెడ్డిని కలిశారు. ఈనెల 18న కలెక్టరేట్ ఎదుట తలపెట్టిన శాంతియుత నిరసనకు మద్దతు తెలపాలని కోరారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ.. 2003లో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసినా 2004 సెప్టెంబర్ 1కి ముందు, తర్వాత జాయిన్ అయ్యారన్నారు. వీరందరూ పాత పెన్షన్‌కు అర్హులేనన్నారు. 2003 డీఎస్సీ టీచర్ల ఫోరానికి తమ నుంచి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు నాగిరెడ్డితో పాటు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌గౌడ్ ప్రకటించారు. కార్యక్రమంలో 2003 డీఎస్సీ టీచర్ల ఫోరం కన్వీనర్లు ఎంవీ ప్రసాద్, ఏ.నాగభూషణం, కే.శ్రీనివాసులు, కే.సాయినాథ్ రెడ్డి, కట్టయ్య పాల్గొన్నారు.